క్లుప్తంగా

9న పదో తరగతి మోడల్ పరీక్ష



మోడల్ పరీక్ష పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: ఈనెల 9న పట్టణంలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞావికాస్ పేరిట పదోతరగతి మోడల్ పరీక్ష జరుగుతుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ తెలిపారు. సోమవారం పోస్టర్లను అర్బన్ సీఐ జయానాయక్‌తో కలిసి విడుదల చేశారు. విద్యార్థులు పేర్లు నమోదు చేసుకునేందుకు సెల్: 6302 317927, 8522 898620, 6300323431లో సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష

రాయదుర్గటౌన్: ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు సోమవారం పర్యావరణ విద్య పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు జరిగింది. రాయదుర్గంలో నాలుగు కేంద్రాల్లో 1,083 మంది విద్యార్థులకు గాను 1,001 మంది పరీక్షలు రాశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 607 మంది విద్యార్థులకు గాను 538 మంది పరీక్షలు రాశారని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 295 మందికి గాను 282 మంది పరీక్షలు రాశారని ప్రిన్సిపాల్ విజయభాస్కర్ తెలిపారు. ఏపీ మోడల్ కళాశాలలో 143 మంది పరీక్షలకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి తెలిపారు. కేజీబీవీలో 38 మంది పరీక్షలు రాశారని ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తెలిపారు.

బాలికల విద్యతోనే మార్పు

రాయదుర్గంటౌన్: బాలికల విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని ఆరోగ్య విద్య బోధకుడు లక్ష్మీనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం స్వచ్ఛ-స్వస్థ్య రాయదుర్గంలో భాగంగా పట్టణంలోని 13వ సచివాలయం పరిధిలోని కోట వీధిలో బేటీ బచావో భేటీ పఢావో, పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి, లక్ష్మీ నరసమ్మ, హెల్త్ సెక్రటరీలు అరుణ, సునీత, సుజాత, శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి

కూడేరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీడీపీఓ శ్రీదేవి సూచించారు. కడదరకుంటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్‌కు ఎంత మంది చిన్నారులు వస్తున్నారు?.. వారి వయసుకు, ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారా? అని ఆరా తీశారు. ఉదయం 9 సాయంత్రం 4 వరకు కేంద్రాన్ని నిర్వహించాలని ఆదేశించారు. పిల్లల హాజరు, వారి గ్రోత్, ఇతర వివరాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అడిషనల్ సీడీపీఓ ఎల్లమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.


పెద్దకొట్టాలపల్లి వాసికి ఉత్తమ లఘుచిత్రాల అవార్డులు



సుధాకర్‌కు అవార్డులు అందిస్తున్న అనంతపురం ఫిల్మ్ సొసైటీ సభ్యులు

ఉరవకొండ: విడపనకల్లు మండలం పెద్దకొట్టాలపల్లికి చెందిన ఏఎస్ఆర్ షార్ట్ ఫిలిమ్స్ అధినేత సుధాకర్, యాక్టర్ సుంకరాజు ఉత్తమ లఘు చిత్రాల అవార్డులు అందుకున్నారు. సోమవారం అనంతపురంలో జరిగిన షార్ట్ ఫిలిం అవార్డు ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ హాస్య లఘుచిత్రం, ఉత్తమ లఘుచిత్రం, ఉత్తమ అవగాహన చిత్ర విభాగాల్లో వ్యవసాయకుడు, నగరంలో నరకయాతన, కొత్త సంవత్సరంలో కొత్త ప్రియురాలు అనే సందేశాత్మక లఘు చిత్రాలకు అవార్డులు అందాయి. అవార్డులను అనంత ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా, ఉరవకొండ జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబులేసు, జ్యూరీ సభ్యుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

విద్యుత్ కోత... తీరని వ్యథ!



- మొదలైన అప్రకటిత విద్యుత్ కోతలు
- విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణాల్లోనూ జాప్యం
- ఆందోళనలో అన్నదాతలు
- జగన్ హయాంలో 24 సబ్‌స్టేషన్ల మంజూరు
- లో ఓల్టేజీ సమస్యకు చెక్ పెట్టేలా సంస్కరణలు

రాయదుర్గం: కూటమి సర్కారు ఏర్పాటైన తర్వాత విద్యుత్ కోతలు.. తప్పని వ్యథలు అన్నట్లుంది. అప్రకటిత విద్యుత్ కోతలు, లోఓల్టేజీ సమస్యతో ప్రజలు, రైతులు, వ్యాపారులు, పరిశ్రమల యాజమాన్యం ..ఇలా అన్ని వర్గాలవారూ అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల సబ్‌స్టేషన్ల వద్ద రైతులు ఆందోళనలు చేస్తున్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి, 24 నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రజా అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా జరిగేలా కార్యచరణ చేసింది. అప్పట్లో పలు మండలాల్లో పనులు ప్రారంభించారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక ఆ నిర్మాణాలు నత్తనడకన సాగుతుండడంతో ప్రజలు కరెంటు కష్టాలు తప్పడంలేదు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో విద్యుత్ కనెక్షన్ల వివరాలు ఇలా..				
నియోజకవర్గం	గృహాలు, వాణిజ్య కనెక్షన్లు	ఇండస్ట్రీ కనెక్షన్లు	ప్రభుత్వ ఆఫీసులు	వ్యవసాయ కనెక్షన్లు
రాయదుర్గం	63,866	422	1,212	24,452
కళ్యాణదుర్గం	74,025	117	1,523	39,249
ఉరవకొండ	42,952	177	969	13,955
మొత్తం	1,80,843	716	3698	77,656

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని గృహాలు, వాణిజ్య భవనాలకు 1,80,843, ఇండస్ట్రీ 716, ప్రభుత్వ కార్యాలయాలు 3,698, వ్యవసాయ 77,656, మొత్తం 2,62,913 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 2014–19 మధ్య టీడీపీ హయాంలో 50 సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా జరిగేది. దీన్ని అధిగమించేందుకు అప్పట్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని ఏకంగా 24 నూతన సబ్‌స్టేషన్ల మంజూరుకు ఒక్కో యూనిట్‌కు రూ.2.50 కోట్ల నుంచి రూ.3 కోట్ల నిధులు కేటాయించారు. పలు మండలాల్లో పనులు ప్రారంభించారు. ఇంతలోనే ఎన్నికలు రావడం.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టం వెరసి విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని రాయలప్పదొడ్డి, గరుడాపురం, ములకలేడు, ముద్దినాయనపల్లి, రాయదుర్గంలో 75 వీరాపురం ఐదు చోట్ల మాత్రమే సబ్‌స్టేషన్లు అందుబాటులోకొచ్చాయి. ఉరవకొండ నియోజకవర్గం గడేకల్లు, డీ హీరేహాళ్ రెండు చోట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పట్టణంలోని శాంతినగర్, కొలగానహళ్లి, ఎర్రగుంట, బాదనహాళ్, నేమకల్లు, చెర్లోపల్లి, గోనేహాళ్, కలుగోడు, కెంచానపల్లి, వేపరాళ్ల, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని గొల్లపల్లి, మాముడూరు, అల్లాపురం, గుద్దెళ్ల, కుందుర్పి, ఉరవకొండ నియోజకవర్గంలోని రామసాగరం, నెరిమిట్ల ఇలా.. 17 చోట్ల విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణాలు చేపట్టలేదు.

లోఓల్టేజీతో ఇబ్బందులు



విద్యుత్ సరఫరాలో తరచూ హెచ్చు తగ్గుల వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. పలు సందర్భాల్లో గృహోపకరణాలు కాలిపోయిన ఘటనలు ఉన్నాయి. వేపరాళ్లలో విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణం పూర్తయితే చుట్టూ నాలుగైదు గ్రామాలకు విద్యుత్ అవసరాలు తీరుతాయి. లోఓల్టేజీతో పాటు అప్రకటిత కోతలు తగ్గుతాయి.

– దిలవర్‌బాషా, వేపరాళ్ల

రెండో విడతలో పనులు



ఆర్‌డీఎస్ఎస్ స్కీమ్ కింద 24 విద్యుత్ ఉప కేంద్రాలు మంజూరయ్యాయి. మొదటి విడతలో కొన్ని పూర్తిచేశాం. రెండో దశలో చేపట్టే నిర్మాణాలకు అనుమతులు రావాల్సి ఉంది. ఉన్నతాధికారులు పరిశీలన చేస్తున్నారు. కొన్నిచోట్ల స్థలాలు, ఇతర కారణాలతో జాప్యం జరిగింది. పనులు మొదలుపెట్టేలా కార్యాచరణ చేస్తున్నాం. ప్రస్తుతం లోఓల్టేజీ, విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నాం.

– శేషాద్రిశేఖర్, విద్యుత్‌శాఖ ఈఈ, కళ్యాణదుర్గం

కోతలతో ఇబ్బందులు



75 వీరాపురం గ్రామం వద్ద ఉన్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం

కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీల బాదుడు మొదలైంది. అప్రకటిత కోతలు, లోఓల్టేజీ సమస్యలు పుట్టుకొచ్చాయి. దీంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలుచోట్ల సబ్‌స్టేషన్ల వద్ద రైతులు ఆందోళనలు నిర్వహించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వేసవిలో ఈ కష్టాలు రెట్టింపు అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణాలు పూర్తయితేనే కష్టాల నుంచి గట్టెక్కొచ్చని భావిస్తున్నారు. అధికారులు, పాలకులు ఈ సమస్యపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యుత్ వైర్లు తగిలి గ్రాసం దగ్ధం



కాలిపోతున్న ట్రాక్టర్ ట్యాలీ

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరు గ్రామ శివారులో జొన్నసొప్ప తరలిస్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగిలి పూర్తిగా కాలిపోయింది. గ్రామస్తులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన సంతోష్ అనే రైతు పొలంలో ఉన్న జొన్న సొప్పను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. జొన్న సొప్పతోపాటు ట్రాక్టర్ ట్యాలీ కాలిపోయింది. దీంతో రూ.3 లక్షలు నష్టం జరిగినట్లు రైతు వాపోయాడు.

8న మండల సర్వసభ్య సమావేశం

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 8న ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి సోమవారం తెలిపారు.

రేపు విద్యుత్ లోక్ అదాలత్

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు జరగనున్న విద్యుత్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏఈ భరత్ తెలిపారు. విద్యుత్‌శాఖ ఏడీ గురురాజ్ హాజరుకానున్నారు. మండలంలోని వినియోగదారులు, రైతులు విద్యుత్ సమస్యలున్నా, వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు ఇవ్వకున్నా లోక్ అదాలత్‌లో అర్జీలు ఇచ్చుకోవచ్చన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

కుందుర్పి: స్థానిక కుసుమగిరి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం 60 మంది నిరుద్యోగ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు సంస్థ సీఈఓ నరసింహమూర్తి తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు లక్ష్మీకాంత్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించేవారు లేరా?

కూడేరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అర్జీలు ఇచ్చేందుకు ప్రజలు ఒక్కరూ రాలేదు. ఇక్కడ అధికారులందరూ హాజరుకారు. వచ్చిన వినతుల పట్ల అధికారులు స్పందించరని ప్రజలు జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా వేదికకు వెళ్తున్నారు. ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఏపీఎం దేవానంద ఫిలిప్పన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, రాజేశ్వరి మాత్రమే పాల్గొన్నారు. మిగిలిన శాఖల అధికారులు హాజరు కాలేదు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తహసీల్దార్ షర్మిళ, ఎంఈఓ మల్లారెడ్డి



సరస్వతీ విద్యామందిరంలో పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

రాయదుర్గంటౌన్: స్థానిక ఓబుళాచారి రోడ్డులోని సరస్వతీ విద్యామందిరంలో సోమవారం వసంత పంచమిని పురస్కరించుకొని సామూహిక అక్షరాభ్యాసం, వసంతి పంచమి, సరస్వతీదేవి హోమం నిర్వహించారు. దాదాపు 90 మంది చిన్నారులకు కుంకుమ, గంధంతో పిల్లల నాలుకపై అక్షరాభ్యాసం చేయించారు. ముఖ్య అతిథిగా స్వామీ అర్చనాంద హాజరై గాయత్రి హోమం, సరస్వతీదేవి అష్టోత్తర యజ్ఞ పూజలతో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు పొరాళ్ల దనార్జున, పాఠశాల కార్యదర్శి తుకారం, హెచ్ఎం రాజేశ్వరి, సమితి కోశాధికారి శంకర్, హులికుంటి మూర్తి, సాంబమూర్తి, కౌన్సిలర్ ప్రశాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: స్థానిక సన్‌రైజర్స్ పాఠశాలలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిళ, ఎంఈఓ మల్లారెడ్డి పాల్గొన్నారు. కరస్పాండెంట్ మారెన్నతో కలసి సరస్వతి పూజలు చేశారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించండి



బియ్యం బస్తా తూకాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

కళ్యాణదుర్గం: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీఓ వసంతబాబు అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలపై అర్జీలను ఆర్డీఓ పరిశీలించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ఆయా శాఖల డివిజన్ స్థాయి అధికారులతో ఆర్డీఓ మాట్లాడారు. ఆయా విభాగాల వారీగా పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వస్తున్న అర్జీలను పెండింగ్‌లో పెట్టకూడదన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరతగతిన న్యాయం చేకూర్చాలన్నారు.

సివిల్ సప్లయ్ గోదాము తనిఖీ

కణేకల్లు: స్థానిక సివిల్ సప్లయ్ గోదామును ఆర్డీఓ వసంతబాబు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, కందిబేడలు, చక్కెర, జొన్నల నిల్వపై ఆరా తీశారు. స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. చౌకధాన్య డిపోలకు నిత్యావసర సరుకులు సకాలంలో సరఫరా చేయాలని స్టాక్ పాయింట్ అధికారి సుధాకర్‌ను ఆదేశించారు. తహసీల్దార్ ఫణికుమార్, ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఐదు వినతులు

గుమ్మఘట్ట: రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు వినతులు అందినట్లు డీటీ విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టాదారుపాసుపుస్తకాల కోసం 2, సర్వే కోసం 3 వినతులందినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఆర్ఐ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గాలికొదిలిన కూటమి సర్కార్



కార్యక్రమంలో పాల్గొన్న తలారి రంగయ్య

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రంగయ్య

బ్రహ్మసముద్రం : కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పట్టించుకోలేదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు గాలికొదిలేశారని వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. సోమవారం సాయంత్రం రాయలప్పదొడ్డి గ్రామంలో 'కాఫీ విత్ వైఎస్సార్ సీపీ లీడర్స్' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

వైఎస్ జగన్‌తోనే ప్రజా సంక్షేమం..

జగనన్న సీఎంగా ఉండి ఉంటే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేవని రంగయ్య అన్నారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్ప, ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి కరణం రాహుల్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు రేవన్న, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి ఎర్రంపల్లి కృష్ణమూర్తి, తాలూక రైతు విభాగం అధ్యక్షుడు అభిలాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటనాయక్, బాధ పల్లప్ప, ఎంపీటీసీ బుసప్ప, సర్పంచులు రామ్మోహన్, శెట్టిగారి మంజునాథ, మాజీ ఎంపీపీ మహదేవప్ప, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లోకేష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెస్ రాయుడు, గోళ్లసూరి, జిన్నా మల్లికార్జున, మాజీ డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎర్రిస్వామి, మైనార్టీ సంఘం నాయకులు నజీర్, మండల యూత్ కన్వీనర్ రాము, పిల్లలపల్లి అంజి, ఆదినారాయణ, శ్రీనివాసులు మంజునాథ, మహేష్ స్వామి, తిమ్మరెడ్డి, రామకృష్ణ, గోవింద, మర్రిస్వామి, శరణప్ప, నటరాజ్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మల్లాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మల్లికార్జున తల్లి నాగమ్మ అనారోగ్యంతో అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సోమవారం కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య ఆస్పత్రికి వెళ్లి నాగమ్మను పరామర్శించారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని కన్నేపల్లి పంచాయతీ సర్పంచ్ గంగమ్మ అత్త తిప్పమ్మ (64) మృతి చెందింది. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ముద్దలాపురం వెళ్లి తిప్పమ్మ మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లేష్, కుటుంబ సభ్యుల పరామర్శించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ఫీజుపోరు'ను విజయవంతం చేద్దాం

- ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, యువనేత భీమిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, యువనేత భీమిరెడ్డి

ఉరవకొండ: మార్చి 12న కలెక్టరేట్ వద్ద జరగనున్న ఫీజు పోరును విజయవంతం చేద్దామని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆయన తనయుడు జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు, పార్టీ యువనేత వై.భీమిరెడ్డి సోమవారం పిలుపునిచ్చారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగ్రామంలో వారు విలేకరులతో మాట్లాడారు. మార్చి 12న ఫీజు పోరు నిరసన ర్యాలీ జిల్లా పరిషత్ భవనం వద్దనున్న వైఎస్సార్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు సాగుతుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం గతంలో రూ.1,780 కోట్ల ఫీజు బకాయిలు పెట్టిపోతే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బకాయి మొత్తం విడుదల చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయి రూ.3,900 కోట్లు విడుదల చేయడానికి నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఫీజులు కట్టలేక చాలా మంది విద్యార్థులు కళాశాలలు మానేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.


కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ భ్రష్టు



మాట్లాడుతున్న ఎంపీపీల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి

కూడేరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టిందని, విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతోందని ఎంపీపీల సంఘం రాష్ట్ర కార్యదర్శి, కూడేరు ఎంపీపీ నారాయణ రెడ్డి విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలవుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేయడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం మెడలు వంచి విద్యార్థులకు న్యాయం జరిగేలా వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మార్చి 12న ఫీజు పోరు పేరిట నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, నాయకులు మంజునాథ్ రెడ్డి, రామచంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా మార్కండేయస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక పదో వార్డులో వెలసిన భక్తమార్కండేయస్వామి ఆలయంలో సోమవారం ఆలయ 21 వార్షికోత్సవంతోపాటు స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి వారిమూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం కల్యాణోత్సవం జరిపించారు.

సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



రాయదుర్గం యాదవవీధిలో కొలువుదీరిన సీతారామ, లక్ష్మణ ఆంజనేయస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో యాదవీధిలో వెలసిన సీతారామ ఆలయంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం పట్టణంలో విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. సోమవారం విగ్రహాల ప్రతిష్ట చేశారు.

మాఘమాస పూజలు

పట్టణంలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో మాఘ మాసాన్ని పురస్కరించుకొని సోమవారం విశేష పూజలు జరిగాయి. మంగళవారం భావనారుషి భద్రావతి అమ్మవారి ఊరేగింపు ఉంటుందని పద్మశాలీయ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు అరవ శివప్ప తెలిపారు. మధ్యాహ్నం కల్యాణోత్సవం జరుగుతుందన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా మహా కుంభాభిషేక పూజలు



మహా పూర్ణాహుతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం మహా కుంభాభిషేక పూజలు మహా పూర్ణాహుతి హోమాలతో ముగిశాయి. అనంతరం స్వర్ణోత్సవ వేడుకల్లో చివరి ఘట్టంగా నవగ్రహ హోమాలు, మహా పూర్ణాహుతి హోమం నిర్వహించారు.

నిమ్మకాయలతో జంబుకేశ్వరుడి అలంకరణ



రాయదుర్గంలో నిమ్మకాయలతో అలంకరణలో జంబుకేశ్వరుడు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూజంబుకేశ్వరస్వామికి సోమ వారం పూజలు జరిగాయి. నిమ్మకాయలతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు.

జోడులింగాలకు ప్రత్యేక పూజలు



కూడేరు: మాఘమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకొని దక్షిణ భారత దేశంలో పేరొందిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చారు. రుద్రాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. అన్నదానం చేశారు.

భోగేశ్వరాలయంలో మాఘమాస పూజలు

వజ్రకరూరు: స్థానిక భోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాఘమాస పూజలు నిర్వహించారు. అభిషేకాలు, రుద్రాభిషేకం, మహామంగళహారతి పూజలు చేశారు. నగరేశ్వరస్వామి, రామేశ్వర స్వామి ఆలయాల్లోనూ పూజలు జరిగాయి.

నేడు రథసప్తమి వేడుకలు

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన బూదగవి సూర్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు జరగనున్నాయి. ఆలయకమిటీ చైర్మన్ చిరంజీవి, సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం కల్యాణోత్సవం జరగనుంది.

నేడు ఆంజనేయస్వామి రథోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని రంగసముద్రం, పూలకుంట గ్రామాల్లో మంగళవారం ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామస్తులు తెలిపారు.

రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

బొమ్మనహాళ్: రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, సకాలంలో నగదు రైతుల ఖాతాలో జమ చేసిన సందర్భంగా సోమవారం శ్రీధరఘట్టలో కృతజ్ఞత సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో 13,800 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ.32 కోట్లు రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. బొమ్మనహాళ్‌లో మండలంలోని 7,557 మంది రైతులతో 8,449 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రూ.19.60 కోట్లు నగదు రైతుల ఖాతాల్లో జమ చేసిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వసంతబాబు, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, ఏఓ సాయికుమార్, తుంగభద్ర ప్రాజెక్టు వైస్ చైర్మన్ కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం

మండలంలోని కురువల్లి, చంద్రగిరి, సిద్ధరాంపురం, హరేసముద్రం నుంచి మండల కేంద్రానికి వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సర్వీసును ప్రారంభించారు. సోమవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు బస్సును ప్రారంభించారు. తహసీల్దార్ మునివేలు, సర్పంచ్ తిప్పేస్వామి, జిందాల్ ప్రతినిధులు రాజ్‌కుమార్, మహంత్, సుభాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.